క్లుప్తంగా

ప్రజా సమస్యలపై పోరాటం

మదనాపురం: ప్రజా సమస్యలపై తమ పార్టీ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పోరాటం కొనసాగిస్తామని సీపీఎం మండల కార్యదర్శి వెంకట్రాములు అన్నారు. సోమవారం మండలంలోని దుప్పల్లిలో సీపీఎం గ్రామ కమిటీని ఎన్నుకోగా.. కార్యదర్శిగా ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు, కార్పొరేటు శక్తులకు అప్పజెప్పడానికి ప్రయత్నం చేస్తున్న బీజేపీని ఎండగట్టాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలు విస్మరిస్తే ప్రజలను సమీకరించి ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఎల్వోసీ అందజేత



చిన్నంబావి: మండలంలోని వెల్టూరు గ్రామానికి చెందిన మంచాలకట్ట బాలస్వామి ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆయనను గ్రామానికి చెందిన పీసీసీ కార్యదర్శి బెక్కెం వేణుగోపాల్‌రెడ్డి పరామర్శించారు. ఈసందర్భంగా బాధితుడి పరిస్థితిని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రూ.2.50లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు.

డ్రైయినేజీ నిర్మాణానికి నిధులు ఇవ్వాలి



పాన్‌గల్: మండలంలోని మాందాపూర్‌లో అండర్ డ్రైయినేజీ నిర్మాణం కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ సోమవారం మాజీ సర్పంచ్ జయరాములుసాగర్ ఆధ్వర్యంలో జిల్లా ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామం చుట్టూ ఉన్న పంట పొలాల నుంచి జాలు నీరు పారుతూ.. ఆ నీరు ఇళ్లు, రోడ్లపైకి పారుతున్నాయని, దీంతో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, విష జ్వరాలతో బాధపడుతూ ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆయా సమస్యలను దృష్టిలో ఉంచుకొని గ్రామంలో అండర్ డ్రైయినేజీ నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని వినతిపత్రంలో కోరినట్లు ఆయన తెలిపారు.

మైక్రోస్కోప్ అందజేత



అమరచింత: మండలంలోని మస్తీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం మైక్రోస్కోప్‌ను విద్యార్థులకు ఎంఈఓ భాస్కర్‌సింగ్ చేతుల మీదుగా అందజేశారు. గత విద్యా సంవత్సరం 2022–2023 జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముఖి పోటీలో పాఠశాలకు చెందిన విద్యార్థులు లావణ్య, హారిక, చందు రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతిని సాధించారు. దీంతో పాఠశాలకు మైక్రోస్కోప్‌ను బహుమతిగా అందించామని జనవిజ్ఞాన వేదిక నాయకులు వేణాచారి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటన్న, అగ్రిప్ప, ఉపాధ్యాయులు ప్రభాకర్, పాండు, నాగరాజు, రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన అరుణోదయ కళాకారులు



అమరచింత: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం 50 వసంతాల వేడుకల్లో పాల్గొనేందుకు పట్టణానికి చెందిన అరుణోదయ కళాకారులు సోమవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. విద్యార్థి దశలో పీడీఎస్‌యూ విద్యార్థి సంఘంలో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేశామని కళాకారులు సత్యనారాయణ, సామేలు తెలిపారు. పీడీఎస్‌యూ 50 వసంతాల వేడుకల్లో పాల్గొంటూ కళాప్రదర్శన ఇవ్వనున్నట్లు తెలిపారు.

అనుమానిత వ్యక్తులతో జాగ్రత్త



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు

వనపర్తి రూరల్: అనుమానిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని.. కాలనీల్లో ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ జె వెంకటేశ్వర్‌రావు అన్నారు. పెబ్బేరు మండల కేంద్రంలోని చెలిమిల్ల గ్రామంలో సోమవారం సాయంత్రం కమ్యూనిటీ కాంటాక్ట్ పోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది పోలీస్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. 4 బైకులకు ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు వారు తెలిపారు. అనంతరం కాలనీవాసులను ఉద్దేశించి డీఎస్పీ మాట్లాడుతూ కొత్త వ్యక్తుల పూర్తి వివరాలను తెలుసుకున్న తర్వాతే ఇళ్లను అద్దెకు ఇవ్వాలని సూచించారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన ఆర్సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ఎలాంటి పత్రాలు లేని వాహనాలు నడిపేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత వాహనాలు కొనేటప్పుడు వాటి యొక్క డాక్యుమెంట్లు సరిగా ఉండేలా చూడాలన్నారు. ఎవరైనా అనుమానస్పదంగా తిరుగుతూ వుంటే వెంటనే పోలీసులకు ఫోన్ చేయాలని లేదా డయల్ 100 కాల్ చేయాలని సూచించారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని కోరారు.

డీఎస్సీ ఫలితాల్లో విజయ దుందుభి



ముంత రమేష్



రవికుమార్



అనిల్‌రెడ్డి



జి.లక్ష్మి



సుష్మిత



అనిత

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో పట్టణానికి చెందిన విద్యార్థులు కొత్తగాని అనిల్‌రెడ్డి, తిరుమల అనిత ప్రతిభ చాటారు. పట్టణానికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు అనిల్‌రెడ్డి ఎస్‌జీటీ విభాగంలో 74.03 మార్కులతో జిల్లా 21వ ర్యాంక్ సాధించాడు. తిరుమల భాస్కర్ కుమార్తె తిరుమల అనిత ఎస్‌జీటీ విభాగంలో 73.47 మార్కులతో జిల్లా 26వ ర్యాంక్ సాధించారు.

కల్వరాల యువత

వీపనగండ్ల: మండలంలోని కల్వరాలకు చెందిన ఇద్దరు డీఎస్సీలో ప్రతిభ కనబర్చి ఉత్తమ ర్యాంకులను సాధించారు. స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్‌లో రవికుమార్ జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించగా.. ఎస్‌జీటీలో ఒంతం సుష్మిత 14వ ర్యాంకు సాధించారు.

కొత్తకోట రూరల్: డీఎస్సీ ఫలితాల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ ఫలితాల్లో కొత్తకోట మండలం కానాయపల్లికి చెందిన మందడి వెంకటమ్మ, బాలయ్య కుమార్తె జి.లక్ష్మి జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించింది. అదే విధంగా కనిమెట్ట గ్రామానికి చెందిన ముంత చంద్రమ్మ, బుచ్చన్న దంపతుల కుమారుడు ముంత రమేష్ జిల్లాలో 4వ ర్యాంక్ సాధించాడు. మండలానికి జిల్లా మొదటి, 4వ ర్యాంక్‌లు రావడంతో కానాయపల్లి, కనిమెట్ట గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

భూ పట్టాలు సాధించే వరకు పోరాడుదాం

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటయ్య
- ముందలితండాలో రాజుల పేరున ఉన్న భూములు సాగు చేస్తున్న రైతుల సదస్సు



మాట్లాడుతున్న వెంకటయ్య

ఖిల్లాఘనపురం: పార్టీలకు అతీతంగా రైతులందరూ పట్టాల సాధన కోసం పోరాడాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వి వెంకటయ్య, ఉపాధ్యక్షురాలు పద్మ, మాజీ ఎంపీపీ కృష్ణానాయక్ అన్నారు. సోమవారం మండలంలోని ముందలితండా సమీపంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ సుమారు వందేళ్ల క్రితం నుంచి మామిడిమాడ, షాపురం గ్రామాల శివారులో రాజుల పేరున ఉన్న భూములను గిరిజన రైతులు సాగు చేసుకుంటున్నారు. మధ్యలో దున్నే వాడికి భూములు పట్టా చేయాలని సీలింగ్ చట్టంతో మరికొన్ని చట్టాలు వచ్చాయి. ఈ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న కలెక్టర్, ఆర్‌డీఓ, తహసీల్దార్లు ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మాజీ ఎంపీపీ తోటి గిరిజనులకు పట్టాలు ఇప్పించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారన్నారు. తన ప్రయత్నం వల్ల పరిస్థితి ఓ కొలిక్కి వచ్చినా.. గిరిజనులకు చేతికి పట్టాలు రాలేదని వాపోయారు.

అందని రైతు పథకాలు

పట్టాలు లేకపోవడం వలన సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అందించే రైతుబంధు, రైతు భరోసా, పంటరుణాలు తదితర రాయితీలు అందడం లేదన్నారు. ఇక నుంచి రాజుల భూములు సాగు చేస్తున్న గిరిజన రైతులు విశ్రాంతి తీసుకోరాదన్నారు. అందుకు భూపట్టాల సాధన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో ఓ కార్యాచరణ ఏర్పాటు చేసుకుని కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కమిటీవారు తీసుకునే ప్రతి నిర్ణయానికి రైతులు సంసిద్ధత వ్యక్తం చేసి ధర్నాలు, నిరసనలు చేసేందుకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి అంజనేయులు, ఉపాధ్యక్షులు దేవన్న, కళా మండలి సభ్యులు వెంకటేష్, నాగరాజు, చెన్నయ్య, గిరిజన నాయకులు గోపాల్ నాయక్, రమేష్‌నాయక్, కృష్ణ నాయక్, తిర్పతి తదితర నాయకులు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తకోట రూరల్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం పీఆర్‌టీయూ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గంతో పాటు కొత్తకోట మండల పీఆర్‌టీయూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన సూర చంద్రశేఖర్ ఎన్నిక కాగా, మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడిగా మిద్దె సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా భీంపల్లి బాల్‌రాజు ఎన్నికయ్యారు. అదేవిధంగా అసో సియేట్ అధ్యక్షుడిగా శివకుమార్, మహిళా ఉపాధ్యక్షురాలిగా నరేంద్రమణి, మండల కార్యదర్శిగా జె.రాములు, మహిళా కార్యదర్శి గా కవితారాణి, జిల్లా సాంస్కృతిక కార్యదర్శిగా వి.రాజారెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతుందన్నారు. సీపీఎస్ రద్దు, పీఆర్‌సీ మొదలైన అంశాలపై రాష్ట్ర నాయకత్వానికి తెలియజేసి, తద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ముంపు భూములకు రూ.25 లక్షలు ఇవ్వాలి

- భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ వెంకటేశ్వర్‌కు రైతుల వినతి
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని గణపసముద్రం రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం కనీసం రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న రైతులతో భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రిజర్వాయర్ అలుగును గతంలో ఉన్న దానికంటే 2.5 ఫీట్ల ఎత్తు ఎందుకు పెంచనున్నట్లు తెలిపారు. దీంతో గ్రామంలోకి నీరు రావడంతో పాటుగా గ్రామంలో ఇక నుంచి ఎవ్వరు కొత్త ఇళ్ల మరుగుదొడ్లు నిర్మించుకోలేని పరిస్థితి వస్తుందని చెప్పారు. ఒక ఫీటు ఎత్తు పెంచి గ్రామంలోకి నీరు రాకుండా ఏదైన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా తమకు ప్రస్తుత పరిస్థితుల్లో ఉన్న ధరలకు ఎక్కడ భూములు కొనలేని పరిస్థితుల్లో ఉన్నందున కనీసం రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. పూర్తి స్థాయిలో పరిహారం ఇచ్చిన తరువాత రైతులందరితో సమావేశం ఏర్పాటు చేసి ఒక ఫీట్ అలుగు ఎత్తు పెంచడం వలన ఎన్ని ఎకరాలు మునుగుతున్నాయో తమకు చెప్పి పనులు చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణ కావస్తుండటంతో భూములకు సంబంధించిన పట్టాపాసు బుక్కులు, ఆధార్ కార్డులు, బ్యాంకు పాసుబుక్కుల జిరాక్సులు తీసుకుని వెరిఫికేషన్ చేసే కార్యక్రమంలో భాగంగా ఖిల్లాఘనపురం వచ్చామన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని, రైతులు చెప్పిన ప్రతి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశం వచ్చిన రైతులకు సమాచారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భూసేకరణ డిప్యూటీ తహసీల్దార్ స్వప్న, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వాలని ధర్నా

కొల్లాపూర్ రూరల్: పట్టణ సమీపంలో ఉన్న సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పని చేస్తున్న పార్ట్‌టైం ఉద్యోగులు ప్రభుత్వం వెంటనే మూడు నెలల వేతనాలు విడుదల చేయాలని కళాశాల ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గత మూడు నెలల నుంచి జీతాలు రావడం లేదన్నారు. కార్యక్రమంలో పార్ట్‌టైం ఉద్యోగులు ఉన్నారు.

దసరా పండుగకు ప్రత్యేక బస్సులు

వనపర్తి రూరల్: బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రజలకు రవాణా పరమైనా ఇబ్బందులు తలెత్తకుండా మంగళవారం నుంచి ఈ నెల 11 వరకు ప్రతి రోజు 10 ప్రత్యేక బస్సులు ఎంజీబీఎస్ నుంచి వనపర్తికి నడపునున్నట్లు వనపర్తి ఆర్‌టీసీ డీఎం వేణుగోపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే వివాహాది శుభకార్యాలకు, విహార యాత్రలకు సురక్షితమైన, సఖవంతమైన ప్రయాణంతో అతి తక్కువ అద్దెతో ఆర్టీసీ బస్సులు నడుపుతామని, ప్రతి బుకింగ్‌పై 10 శాతం రాయితీ ఇస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు, ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలని డీఎం కోరారు.

జీవితబీమాపై ప్రజలకు అవగాహన

వనపర్తి రూరల్: మండలంలోని కడుకుంట్ల గ్రామంలో గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆధ్వర్యంలో జీవిత బీమాపై రైతులు, ప్రజలకు అవగాహన కల్పించారు. అందరూ బ్యాంక్‌లో ఖాతా కలిగి ఉండడంతో పాటు జీవితబీమా కలిగి ఉండాలని, బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచించారు. అలాగే ఇటీవల మృతి చెందిన బోయ వెంకటేష్ రూ.20 లక్షల బీమా చెక్కును మృతుడి భార్య బాలకిష్టమ్మకు అందజేశారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



కొత్తకోట రూరల్: స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ సోమవారం పదవీ విరమణ పొందిన ఎస్‌ఎన్ సూర్యకుమార్‌కు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పి.కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీనివాసులు, గొల్లబాబు, నరేందర్‌సాగర్, రామ్మోహన్‌రెడ్డి, పెంటన్నయాదవ్, లతీఫ్, ముజీబ్, నవీన్‌రెడ్డి, శ్రీకాంత్, రాములు, శ్యామ్, మహేష్, బాలరాజుయాదవ్, మహేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు..



ఆత్మకూర్: నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన చాంద్‌పాషాను అంబేడ్కర్ సంఘం రాష్ట్ర నాయకుడు సత్యం, జిల్లా కన్వీనర్ కుర్మన్న సత్కరించారు. సోమవారం కార్యాలయంలో ఆయనను కలిసి భూ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు కురుమూర్తి, నర్సింహులు, కళ్యాణ్, నరేష్, ప్రకాష్, వెంకటేష్, భాస్కర్, ముదిరాజ్ సంఘం నాయకుడు గణేష్ తదీతరులు ఉన్నారు.

రైతులపై నిర్లక్ష్యం తగదు



వనపర్తి రూరల్: కాంగ్రెస్ పార్టీ అన్నదాతలకు అందించే రైతుబంధు, రుణమాఫీ అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని, ఎన్నికల ముందు అమలు సాధ్యం కానీ హామీలు ఇచ్చి నేడు రైతులను మోసం చేస్తుందని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. అధికార కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ సోమవారం పెబ్బేరు పట్టణంలోని సుభాష్‌చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

బాలలను రక్షించుకుందాం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వనపర్తి రూరల్: జిల్లా బాలల పరిరక్షణ విభాగం, షీ టీం ఆధ్వర్యంలో సోమవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల విద్యార్థులకు షీ టీం విభాగం హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ బాలల పరిరక్షణ, సైబర్ క్రైం, షీ టీం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1098 సేవల గురించి వివరించారు. విద్యార్థులు చదువుకునే దశలో చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని, సమాజంలో బాలికలపైన జరుగుతున్న అఘాయిత్యాలు దృష్టిలో ఉంచుకొని పరిచయం లేని వ్యక్తులతో జాగ్రతగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చుతూ ఉన్నత స్థానంలో నిలబడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి, మధు, వెంకటస్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్



బడి నిద్ర భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని యాపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు కలిసి వినూత్న కార్యక్రమం బడి నిద్రకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా సోమవారం రాత్రి సాయంత్రం హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కలిసి గ్రామంలో తిరుగుతూ విద్యార్థుల ఇళ్లను సందర్శించి, చదువు గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ తల్లిదండ్రుల సమావేశానికి వారుహాజరు కావటం లేదని, ఉపాధ్యాయుల అభిప్రాయం మేరకు బడి నిద్ర కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ సందర్భంగా సెల్ ఫోన్, టీవీలకు విద్యార్థులను దూరంగా ఉంచాలని సూచించారు. ఇంటి వద్ద తల్లిదండ్రులు పిల్లలతో సరదాగా గడపాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మైనొద్దీన్, ఈశ్వర్‌రెడ్డి, శ్రీధర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్మృతివనం ప్రారంభం



ఖానాపూర్‌లో మొక్కలు నాటుతున్న జితేందర్‌రెడ్డి

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్, ఎస్టేట్ అధికారి చంద్రకళ తన మాతృమూర్తి దివంగత అనంతమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన స్మృతివనం (పార్క్)ను సోమవారం మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర గీత కార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ నాగరాజుగౌడ్ ప్రారంభించారు. ఖానాపూర్‌లో డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ గ్రామస్తుల సౌకర్యార్థం అన్నిరకాల పండ్లు, పూల మొక్కలతో పార్క్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి అయూబ్‌ఖాన్, కౌన్సిలర్ చెన్నయ్య, మాజీసర్పంచ్ తిరుపతయ్య, నిర్వాహకులు జానకీరాంరెడ్డి, రంగారెడ్డి, జైపాల్‌రెడ్డి, మధుకర్, నాయకులు మణివర్ధన్‌రెడ్డి, నాగేష్, రఫీఖ్, సర్వారెడ్డి, రమేష్, వంశీ, భగవంతు, చంద్రన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



బొల్లారంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ నర్సింహ

వీపనగండ్ల: ప్రభుత్వ నిబంధనల మేరకు పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందివ్వాలని ఎంఈఓ నర్సింహ అన్నారు. సోమవారం బొల్లారం ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించి, విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రోజువారి హాజరుపై నిర్లక్ష్యం వహించరాదని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ శ్రీనివాసులు, హెచ్‌ఎంలు రఘు, నిరంజన్, సీఆర్‌పీ నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎంబీబీఎస్ సీట్లు



మైథిలీ



జె.అఖిల్



అఖిల



యామినిరెడ్డి



వాజిహా ఇరామ్

అమరచింత: నీట్ ఫలితాల్లో పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు షేక్‌అహ్మద్ మనుమరాలు వాజిహా ఇరామ్ ప్రతిభ కనపర్చి 562 మార్కులు సాధించి.. వికారాబాద్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. స్థానిక పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించిన వాజిహా ఇరామ్ నీట్ ఫలితాల్లో అత్యుత్తమ ఫలితం సాధించడం హర్షణీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి అభినందించారు.

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయులు జొల్లు గంగులు, శ్యామల దంపతుల కుమారుడు అఖిల్ హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీలో, మేడిపల్లి నాగేశ్వర్‌రెడ్డి, లావణ్య కుమార్తె యామినిరెడ్డి కరీంనగర్‌లోని ప్రతిమ మెడికల్ కాలేజీలో, ముగిగొండ గోపి, మాధవి కుమార్తె అఖిల సంగారెడ్డి జిల్లాలోని ఎంఎన్‌ఆర్ మెడికల్ కాలేజీలో సీట్లు సాధించారు.

ఆత్మకూర్: మండలంలోని బాలకిష్టాపూర్ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని మైథిలీ ఎంబీబీఎస్‌లో ఉచిత సీటును సాధించింది. ఆత్మకూర్‌లోని ఎంవీరామన్ పాఠశాలలో విద్యను అభ్యశించిన మైథిలీ 484 మార్కులు సాధించి జగిత్యాలలోని మెడికల్‌కళాశాలలో ప్రవేశం పొందింది. ఈసందర్భంగా మైథిలిని, తల్లి అనితను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, మాజీఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్ తదితరులు అభినందించారు.

సమాజ నిర్మాణంలో ‘ఉపాధ్యాయుల’ పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

పాన్‌గల్: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని ఎమ్మెల్సీ, ప్రజా గాయకుడు గోరటి వెంకన్న అన్నారు. సోమవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్ పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు జన్మనిస్తే గురువు విజ్ఞానాన్ని ప్రసాదించి తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. దేశ భవిష్యత్, సమాజ నిర్మాణం ఉపాధ్యాయుల చేతిలోనే ఉందని.. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారాన్ని నేర్పి ఉత్తములుగా తయారుచేయాలని కోరారు. అనంతరం టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ.. ఉద్యోగులకు బదిలీ, పదవీ విరమణ తప్పనిసరని అన్నారు. పదవీ కాలంలో వారు చేసిన సేవలు చిరకాలం గుర్తుంటాయని.. నరేందర్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అక్షరాస్యత ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, స్థానిక పాఠశాల ఉపాధ్యాయ బృందం హెచ్‌ఎంను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పరామర్శ



అమరచింత: కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు పోసిరిగారి విష్ణు తండ్రి పోసిరిగారి దశరథ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న దశరథ్ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం శవయాత్రలో పాల్గొని పాడే మోశారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీలు తిరుమలేష్, మహంకాళీ విష్ణు, హనుమంతునాయక్ తదితరులు పాల్గొన్నారు.